10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం | 3 మార్చి 2025 | పేజీలు 8

# నీళ్లు పాతాళానికి.. నిధులు దిల్లీకి..

### 450 మంది రైతులను పొట్టనపెట్టుకున్న కాంగ్రెస్

### 48 గంటల్లో నీళ్లివ్వకపోతే ఉత్తమ్ ఛాంబర్ ఎదుట ధర్నా చేస్తా: కేటీఆర్

హైదరాబాద్ పెన్ పవర్:"ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత నీళ్లు పాతాళానికి చేరాయి.. నిధులు దిల్లీకి వెళ్లాయి.. నియామకాలు గాలికి పోయాయి.. ఇప్పటి వరకు 450 మంది రైతులను ఈ సర్కారు పొట్టనపెట్టుకుంది.. రాబోయే 48 గంటల్లో వ్యవసాయానికి సరిపడా సాగునీటిని విడుదల చేయకపోతే నేనే

- మిగతా 2లో...





## జగద్గిరిగుట్ట బస్‌డిపో కోసం....

# స్థానికుల పోరాటం

### దయనీయంగా మారిన జగద్గిరిగుట్ట బస్సుల పార్కింగ్..

- జగద్గిరిగుట్ట బస్ డిపోకోసం ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ధర్నా..
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం దశాబ్ద కాలంగా జగద్గిరిగుట్ట ప్రజల ఇబ్బందులు..
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా బస్ డిపో సమస్యను పరిష్కరించాలని డిమాండ్..
- ప్లకార్డులు పట్టుకుని జగద్గిరిగుట్ట కొత్త బస్ డిపో ఏర్పాటు చేయాలని ధర్నా..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 2:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జగద్గిరిగుట్ట ప్రాంతంలో పాత బస్ డిపో పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని.. బస్సులను పార్కింగ్ చేసేందుకు తగిన స్థలం లేకపోవడంతో, రాత్రిపూట వివిధ జిల్లాల నుండి వచ్చే సుమారు 40 బస్సుల పార్కింగ్ స్థానికులకు ఇబ్బందిగా తయారైందని, ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ధర్నా నిర్వహించారు.. ఉదయం, సాయంత్రం బస్టాండ్ ప్రాంతంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యల కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. దశాబ్ద కాలంగా స్థానిక ప్రజలు హెచ్‌ఎంటీ స్థలంలో కొత్త బస్ డిపో నిర్మించాలని నిరంతరం డిమాండ్ చేస్తున్నారు.. 2017 ఎంపీ ఎన్నికల సమయంలో అప్పటి మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే వివేకానంద కొత్త డిపో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, దాన్ని అమలు చేయకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని సతీష్ తెలిపారు.. నూతన బస్ డిపో నిర్మాణానికి సంబంధించి ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని, ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఆకుల సతీష్ టీం జగద్గిరిగుట్ట బస్ డిపో సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, "గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని సతీష్ ఆరోపించారు.. మినీ తెలంగాణగా పేరొందిన జగద్గిరిగుట్టకు 10 ఎకరాల్లో నూతన బస్ డిపో నిర్మించి ప్రజలకు వాహన సౌకర్యాన్ని అందించాలి," అని అన్నారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ గౌడ్, ఆంజనేయులు, అమలేశ్వరి, శ్రీనివాస్ గౌడ్, అరుణ్ రావు, సుభాష్, లానా, విశాల్, పనింద్ర, సంతోష్, శివ గౌడ్, ఈశ్వర్ రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.





# రాష్ట్రంలో దుర్మార్గమైన ప్రతిపక్షం ఉంది..
# రైజింగ్ తెలంగాణను ఎవరూ ఆపలేరు



హైదరాబాద్ పెన్ పవర్: రైజింగ్ తెలంగాణను ఎవరూ ఆపలేరని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వనపర్తి జిల్లా పర్యటనలో భాగంగా సీఎం రేవంత్, మంత్రులతో కలిసి వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, అది చూడకుండా బీఆర్ఎస్ విమర్శలకు దిగుతోందని

-2 లో

# ఏదో ఒకటి చేయాలని మోదీ అనుకున్నా...
# కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు

హైదరాబాద్ పెన్ పవర్:వనపర్తిలో ప్రజా పాలన-ప్రగతి బాట బహిరంగ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ తెలంగాణకు ఏదో ఒకటి చేయాలని కోరుకుంటున్నా, కిషన్ రెడ్డి

-2 లో



# ఏదో ఒకటి చేయాలని మోదీ అనుకున్నా... కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు

- మొదటి పేజి తరువాయి

సైంధవుడిలా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణలో అధికార పీఠం నుంచి తన రహస్య మిత్రుడు దిగిపోయాడని కిషన్ రెడ్డి బాధపడుతున్నారని విమర్శించారు. వరంగల్ ఎయిర్ పోర్టు ఇచ్చింది ప్రధాని మోదీ... కానీ ఎయిర్ పోర్టును తానే తెచ్చానని కిషన్ రెడ్డి చెప్పుకుంటున్నాడని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

"మరి మెట్రో రాలేదు, మూసీ ప్రక్షాళనకు నిధులు రాలేదు... వీటిని ఆపింది ఎవరు? ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం తన వల్లే మంజూరు అయిందని కిషన్ రెడ్డి చెప్పుకుంటున్నారు... మరి దక్షిణభాగం ఎవరి వల్ల ఆగిపోయింది? పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 60 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా... పదేళ్ల నుంచి పెండింగ్ లో ఉంది... దీన్ని ఆపింది ఎవరు? ఏదైనా ప్రాజెక్టు వస్తేనేమో తన ఖాతాలో వేసుకుంటారు... రాకపోతే రేవంత్ రెడ్డి వైఫల్యం అంటారు. తన కంటే చిన్నోడు సీఎం అయ్యాడని కిషన్ రెడ్డికి కడుపుమంట" అంటూ రేవంత్ రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు.

# రాష్ట్రంలో దుర్మార్గమైన ప్రతిపక్షం ఉంది.. రైజింగ్ తెలంగాణను ఎవరూ ఆపలేరు

- మొదటి పేజి తరువాయి

అన్నారు. రాష్ట్రంలో దుర్మార్గమైన ప్రతిపక్షం ఉందని, బీఆర్ఎస్ మాదిరిగా తమది గడీల పాలన కాదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తాము బీఆర్ఎస్ మాదిరిగా మాట ఇచ్చే తప్పే రకం కాదని, ఆర్థిక ఇబ్బందులు ఉన్న పథకాలను అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా భట్టీ అన్నారు. కులగణనలో పాల్గొనని నేతలు మమ్మల్ని విమర్శిస్తారా అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేశామని, జాతరలాగా సంక్షేమ పథకాలుఅమలు చేస్తున్నామని భట్టీ తెలిపారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటామని అన్నారు. కాంగ్రెస్ లాగా పథకాలు ఎందుకు అమలు చేయలేదో బీఆర్ఎస్ ను ప్రశ్నించాలని కార్యకర్తలకు సూచించారు.

## యాదగిరి క్షేత్రంలో ధ్వజారోహణం

**హైదరాబాద్ పెన్ పవర్:**యాదగిరిగుట్ట పంచనారసింహుల దివ్యాలయంలో ఆదివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి దేవతాహ్వానం వేడుకలతో వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రచార ఘట్టం ఆవిష్కృతమైంది. లోకకల్యాణార్థం ఏటేటా నిర్వహించే ఉత్సవాల విశిష్టతను విశ్వమంతా చాటేందుకు గరుడ ఆళ్వారుడిని రప్పించి పూజలు, ఇష్ట పదార్థాలను నైవేద్యంగా సమర్పించే కైంకర్యాలను చేపట్టారు. స్వామివారి తిరు కల్యాణానికి దేవతలకు పిలుపునిచ్చే బాధ్యతను గరుడు ఆళ్వారుడికి పూజారులు ఆరాధనల ద్వారా అప్పగించారు. రాత్రి భేరి పూజలో అష్టారాగాలను ఆలపిస్తూ సకల దేవతలను స్వాగతిస్తూ విడిది ఏర్పాట్లు చేశారు.

**యాదగిరీశుడికి స్వర్ణ వాహనాల బహూకరణ**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో స్వామివారు బంగారు వాహనాలపై విహరించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన సాయి పావని కన్‌స్ట్రక్షన్ ఇండియా లిమిటెడ్ యజమాని గార్లపాటి సుభాష్ తన తల్లిదండ్రుల పేరిట రూ.24 లక్షల వ్యయంతో తయారు చేయించిన స్వర్ణ కవచ శేష, గరుడ వాహనాలను ఆదివారం సమర్పించారు. వీటితోపాటు బర్మా టేక్‌తో స్వామివారి సేవా పీఠాన్ని సుమారు రూ.4 లక్షల వ్యయంతో తయారు చేయించి దేవస్థానానికి అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో నూతన సేవా పీఠం, బంగారు వాహనాలతో ఊరేగింపు నిర్వహిస్తామని ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

# నీళ్లు పాతాళానికి.. నిధులు ఢిల్లీకి..

- మొదటి పేజి తరువాయి

స్వయంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఛాంబర్ ఎదుట ధర్నా చేస్తా.." అని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో సాగునీరు అందక ఎండిన వరిపొలాలను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. నీరులేక ఇబ్బందులు పడుతున్నామంటూ విలపించిన గిరిజన మహిళా రైతులను కేటీఆర్ ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అంటే కాళేశ్వరం అని, కాంగ్రెస్ కరువు తీసుకొచ్చిందని రాష్ట్ర రైతులు చర్చించుకుంటున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి కేసీఆర్‌పై ఉన్న ద్వేషం, కోపం, పగే దీనికి కారణమని దుయ్యబట్టారు. "మేడిగడ్డ బ్యారేజీలో నెర్రెను కాంగ్రెస్ పాలకులు అతిపెద్ద ప్రమాదంగా చూపుతున్నారు. కాళేశ్వరం స్టేజ్ 2 కింద తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ వరకు పంటలు చేతికందకుండా పోయే దుస్థితి నెలకొంది. మధ్యమానేరులో ప్రస్తుతం ఉన్న 15 టీఎంసీల నీటినుంచి ఒక టీఎంసీని మల్కపేట రిజర్వాయరుకు విడుదల చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో.. ఫ్రీ చికెన్ ఫ్రై, చికెన్ పకోడీ, చిల్లీ చికెన్.. ఎగబడి తిన్న జనాలు




**హైదరాబాద్ పెన్ పవర్:**బర్డ్ ఫ్లూపై అపోహను తొలగించాలని చికెన్ వ్యాపారులు చికెన్ ఐటమ్స్‌తో ఫ్రీ ఫుడ్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు. ఆదివారం హయత్ నగర్‌లోని వెన్ కాబ్ వెంకటేశ్వరా హేచరీస్ కంపెనీ, జ్యోతి చికెన్ సెంటర్ నిర్వాహకులు మహేష్ ఆధ్వర్యంలో కుంట్లూర్ మెయిన్ రోడ్‌లో మెగా చికెన్ మేళా నిర్వహించారు. చికెన్ ఫ్రై, చికెన్ పకోడీ, చిల్లీ చికెన్, బాయిల్డ్ ఎగ్స్‌తో ఫెస్ట్ నిర్వహించి ఉచితంగా పంపిణీ చేయడంతో చికెన్ ఐటమ్స్ తినేందుకు జనాలు ఎగబడ్డారు. ఫ్రీగా అందిస్తున్న చికెన్ ఐటమ్స్ ప్రజలు ఆవురావురమంటూ లాగించేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. బర్డ్ ఫ్లూపై ఉన్న అపోహలను నమ్మవద్దని చెప్పారు. చికెన్ వండే సమయంలో బాగా ఉడికించి తింటే ఎలాంటి వ్యాధులు రావని అన్నారు. ప్రజల్లో ఉన్న అపోహను తొలగించేందుకే ఈ చికెన్ ఫెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. 70 డిగ్రీల సెల్సియస్ వేడిలో చికెన్ ను బాగా ఉడికించి తింటే ఎలాంటి సమస్య ఉండదని అధికారులు చెప్తున్నారు. ఉడికీ ఉడకని చికెన్, గుడ్లు తింటేనే బర్డ్ ఫ్లూ సోకే అవకాశం ఉందంటున్నారు. బర్డ్ ఫ్లూ మనుషుల నుంచి మనుషులకు సోకదని, పక్షులు, జంతువుల నుంచి మాత్రమే మనుషులకు సోకుతుందంటున్నారు. బర్డ్ ఫ్లూ వల్ల పక్షులు, కోళ్లు చనిపోయే అవకాశం ఉంది కానీ, మనుషులపై మాత్రం ప్రభావం తక్కువే ఉంటుందని చెప్తున్నారు. ఒకవేళ జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస సంబంధిత సమస్యలు ఉంటే వెంటనే డాక్టర్ ను సంప్రదించాలని సూచిస్తున్నారు. తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో ఇప్పటికే చికెన్ మేళాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

# రెండేళ్లలో రూ.10 వేలను రూ.6 లక్షలు చేసిన స్టాక్.. త్వరలో బోనస్ షేర్లు ఇచ్చే ప్లాన్..!




**హైదరాబాద్ పెన్ పవర్:**తక్కువ టైమ్ లో ఎక్కువ ప్రాఫిట్స్ కోసం చాలా మంది స్టాక్ మార్కెట్ ను ఒక ఆప్షన్ గా చూస్తుంటారు. అయితే కొన్ని సార్లు సక్సెస్ కావచ్చు.. కొన్ని సార్లు లాస్ అవ్వచ్చు. అలాంటి మల్టీ బ్యాగర్ స్టాక్స్ పట్టుకోవడం మాత్రం సవాల్ తో కూడున్నదే. ఎదుకంటే కొన్నిసార్లు ఎంతో ఊహించి ప్లాన్ చేసి ఇన్వెస్ట్ చేసిన కంపెనీ.. అనుకున్నట్లుగా పెరగకపోవచ్చు. కానీ ఈ కంపెనీ మాత్రం కేవలం రెండేళ్లలో ఊహించని బంపర్ ప్రాఫిట్స్ ను ఇచ్చింది. కేవలం రెండేళ్లలో పది వేలను దాదాపు రూ.6 లక్షలకు పెంచేసింది. ఇంత మార్కెట్ ఫాల్ లో కూడా ఈ స్టాక్ 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టి మార్కెట్ లో బజ్ క్రియేట్ చేసింది. ఆ కంపెనీ పేరు వంటేజ్ కాలెడ్జ్ అకాడెమీ ( %ఋతున్త్రవ ఖఅశీషశ్రీవసన్త్రవ ూఎఝఎనవవఎఎ%). గత మూడు ట్రేడింగ్ సెషన్స్ లో ఈ స్టాక్ బ్యాక్ టు బ్యాక్ అప్పర్ సర్క్యూట్ కొడుతోంది.

ఈ స్టాక్ బీఎస్ఈ లో శుక్రవారం (ఫిబ్రవరి28) రూ.110.40 దగ్గర క్లోజ్ అయ్యింది. గత ఆరు నెలలో 67 శాతం పెరగగా, లాస్ట్ ఇయర్ నుంచి ఇప్పటి వరకు 520 శాతం రిటర్న్స్ ఇచ్చింది. 2023లో రూ.1.88 దగ్గర ఉన్న స్టాక్ ఈ రెండేళ్లలో 5772% పెరిగి సూపర్ మల్టీ బ్యాగర్ రిటర్న్స్ ఇచ్చింది. అంటే 2023లో రూ.10 వేలు ఇన్వెస్ట్ చేసి ఉంటే ఇప్పుడు ఆ విలువ 5 లక్షల 87 వేల రూపాయలు అయ్యేది.

**బోనస్ షేర్లు:**

ఈ కంపెనీ త్వరలోనే బోనస్ షేర్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. 2:1 రేషియోలో బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అంటే ఒక షేర్ కు రెండు షేర్లు బోనస్ గా ఇవ్వనున్నారు. రికార్డ్ డేట్ మార్చి 5 గా నిర్ణయించారు. అంటే మార్చి 5 తేదీ ఎవరికి అకౌంట్లో అయితే షేర్లు ఉంటాయో వారికి బోనస్ షేర్లు ఇవ్వనున్నారు.

**కంపెనీ గురించి:**

ఈ కంపెనీ కేవలం రూ.1257 కోట్ల చిన్న కంపెనీ. ఫైనాన్స్, బ్యాంకింగ్ లో ఇన్స్టిట్యూషన్స్ నడిపిస్తోంది. చాలా హై వాల్యుయేషన్ లో ఉంది. అంటే ఇండస్ట్రీ %ూ/జు% 37 ఉంటే ఈ స్టాక్ పీఈ 648 గా ఉంది. అంటే చాలా ఎక్కువ పీఈ లో ఉంది. గత రెండు మూడు క్వార్టర్స్ నుంచి ప్రాఫిట్ మేకింగ్ కంపెనీగా మారింది. అంతకు ముదు నష్టాల్లోనే ఉంది. కాబట్టి.. ఇప్పటి వరకు మల్టీ బ్యాగర్ రిటర్న్స్ ఇచ్చిందని, ఇకనుంచి కూడా ఇస్తుందనీ ఇన్వెస్ట్ చేయడం సరికాదు. కంపెనీ గురించి పూర్తిగా తెలుసుకుని నిర్ణయం తీసుకోగలరు. కంపెనీ బిజినెస్ గురించి అవగాహన లేకుండా, కంపెనీ ఫైనాన్షియల్స్ గురించి తెలియకుండా డెసిషన్ తీసుకోకూడదు. మీ ఫైనాన్షియల్ అడ్వైజర్ ను సంప్రదించి నిర్ణయం తీసుకోగలరు.

## ఎస్ఎల్బీసీ టన్నెల్ లోకి వెళ్లి సహాయక చర్యలను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**నాగర్ కర్నూలు జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్బీసీ టన్నెల్ 14వ కిలోమీటరు వద్ద జరిగిన ప్రమాదంలో 8 మంది చిక్కుకుపోగా, నేటికి 9వ రోజు కూడా వారి ఆచూకీ తెలియరాలేదు. ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి సంఘటన స్థలానికి వచ్చారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ లోకి వెళ్లి సహాయక చర్యలు కొనసాగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం టన్నెల్ వద్ద అధికారులతో సమావేశం అయ్యారు. సహాయక చర్యలపై సమీక్ష చేపట్టారు. గత 9 రోజులుగా సహాయక చర్యలు జరుగుతున్న తీరును అధికారులు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మృతదేహాలు బయటికి తీసుకువచ్చే వరకు పనులు ఆపొద్దని సూచించారు. రెస్క్యూ టీమ్ లకు అధికారులు అన్ని విధాలుగా సహకరించాలని నిర్దేశించారు. కాగా, ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ అధికారులు కూడా ఈ సమీక్షలో పాల్గొన్నారు.

## రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకంగా నీటి ఊట.. ఎస్ఎల్బీసీ సొరంగంలోకి నీళ్లెక్కడి నుంచి వస్తున్నాయంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎస్ఎల్బీసీ సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికులను వెలికితీసేం దుకు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. బేరింగ్ మిషన్ ను కట్ చేసి కార్మికులు ఉన్న చోటుకు దాదాపు చేరుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఆగకుండా వస్తున్న నీటి ఊట వలన పనులకు ఆటంకం కలుగుతోంది. పెద్ద పెద్ద కొండల, బండలపైనుంచి నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి, అసలు కొండలపైన నీళ్లు ఎక్కడ ఉన్నాయి అనే ప్రశ్న కలుగుతోంది. నిరంతరంగా వస్తున్న నీటి ఊటతో పనులు ఆటంకం కలుగుతున్నందున నీటి జాడ తెలుసుకునేందుకు జియోలాజికల్ టీమ్ అన్వేషణ మొదలుపెట్టింది. టన్నెల్ పైభాగంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఉంది. ఆ ప్రాంతంలో నీటి ఆధారాలు ఎక్కడ ఉన్నాయో పరిశీలిస్తున్నారు.

**వాగుల ప్రవాహం వల్లే సొరంగంలోకి నీటి ధారలు:**

సొరంగంలోకి వాగుల ప్రవాహం వల్లే నీటి ఊట వస్తోందని అధికారులు గుర్తించారు. మల్లెల తీర్థం దగ్గర ఉన్న వాటర్ ఫాల్స్ కృష్ణా నదివైపు ప్రవహిస్తోందని, మల్లెల తీర్థం నుంచి పెద్ద అంతర ప్రవాహం కూడా పారుతున్నట్లు గుర్తించారు. అదే విధంగా ప్రమాద స్థలం 450 మీటర్ల పైభాగంలో నీటి పొరలు ఉన్నట్లు గుర్తించారు. పైభాగంలో ఉన్న అంతర ప్రవాహాల వలన ఊట పెరుగుతోందని జియోలాజికల్ టీమ్ స్పష్టం చేసింది. అమ్రబాదు టైగర్ రిజర్వ్ ఏరియాలో ఉర్సు వాగు, మల్లె వాగులు మల్లెతీర్థం వైపు నుంచి కృష్ణా నది వైపు ప్రవాహిస్తుండటంతో ఊట వస్తున్నట్లుగా గుర్తించారు.

నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ దగ్గర ఫిబ్రవరి 22 ఉదయం ప్రమాదం జరిగింది. రిటైనింగ్ వాల్ కడుతుండగా 14వ కిలో మీటర్ వద్ద 3 మీటర్ల మేర పైకప్పు కుంగిపోయింది.. రిటైనింగ్ వాల్ కూలి టన్నెల్‌లో రింగులు విరిగిపడడంతో.. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటనలో 8 మంది కార్మికులు టన్నెల్ లో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే.

# ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు సీఎం రేవంత్.. రెస్క్యూ ఆపరేషన్‌పై ఆరా

**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్దకు చేరుకున్నారు. రెస్క్యూ ఆపరేషన్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ దగ్గర సహాయక చర్యలను సీఎం స్వయంగా పరిశీలించారు. 9 రోజులుగా రెస్క్యూ ఆపరేషన్ ను మంత్రులు ఉత్తమ్, జూపల్లి దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తున్న సంగతి తెలిసిందే. %ట్రా% రాడార్ తో కార్మికులను రెస్క్యూ టీం ఇప్పటికే గుర్తించింది. ఒక ఏరియాలో నలుగురు, %ఏదీవీ% ముందు మరో నలుగురు ఉన్నట్లు గుర్తించారు.నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ దగ్గర ఫిబ్రవరి 22 ఉదయం ప్రమాదం జరిగింది. రిటైనింగ్ వాల్ కడుతుండగా 14వ కిలో మీటర్ వద్ద 3 మీటర్ల మేర పైకప్పు కుంగిపోయింది.. రిటైనింగ్ వాల్ కూలి టన్నెల్‌లో రింగులు విరిగిపడడంతో.. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటనలో 8 మంది కార్మికులు టన్నెల్ లో చిక్కుకుపోయారు.



ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకుపోయిన 8 మంది ప్రాణాలు కోల్పోయారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)కు చెందిన జీపీఆర్ స్కానర్ ద్వారా టీబీఎం మిషిన్‌కు ముందు ఒకచోట నాలుగు డెడ్‌బాడీలను, దాని కింద రెండు చోట్ల మరో నాలుగు మృతదేహాలను గుర్తించినట్టు తెలిపారు. మిషిన్ ముందు భాగంలోని నాలుగు మృతదేహాలు మూడు ఫీట్ల బురదలో ఉన్నాయి. వాటిని ఆదివారం వెలికితీసే అవకాశం ఉంది. ఈ డెడ్‌బాడీలు ఉన్న ప్రాంతమంతా గట్టిపడింది. అయినప్పటికీ యంత్రాలతో కాకుండా మనుషుల ద్వారానే తవ్వి తీసేందుకు ప్రయత్నిస్తున్నాం. మిషిన్ కింది భాగంలో ఉన్న మిగిలిన నాలుగు మృతదేహాలను వెలికితీయడానికి టీబీఎంను కట్ చేస్తున్నాం. ఇందుకు మరికొంత సమయం పడ్తుంది. టన్నెల్ లోపలి నుంచి బురద, మట్టి, టీబీఎం శకలాలను తొలిగించే ఆపరేషన్‌నిరంతరాయంగా కొనసాగుతున్నది” అని జూపల్లి వెల్లడించారు.

# తెలంగాణకు భారాస, భాజపా ఏం చేశాయి?: సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** వనపర్తి తనకు చదువుతో పాటు సంస్కారం నేర్పించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వనపర్తి విద్యార్థిగా తెలంగాణకు వన్నెతెచ్చాడనే కీర్తి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ‘ప్రజాపాలన-ప్రగతి బాట’ బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు.



“గతంలో వనపర్తి రాజకీయాల్లో కక్షలు, ధన ప్రభావం ఉండేది కాదు. ఐదేళ్ల క్రితం ఇక్కడి నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే రాజకీయాలను కలుషితం చేశారు. కేసీఆర్ పదేళ్లు తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్నారు. మోదీ 12 ఏళ్లుగా ప్రధానిగా ఉన్నారు. తెలంగాణకు భాజపా, భారాస ఏం చేశాయి? ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ జరిగిందా? లేదా? చెప్పాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా. భారాస, భాజపా నాయకుల తప్పుడు ప్రచారాన్ని రైతులు తిప్పికొట్టాలి. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నా ఎక్కడైనా కోతలు విధించామా? రూ.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామా?లేదా? మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నాం. 65 లక్షల మంది మహిళలు స్వయంసహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. సభ్యుల సంఖ్య కోటికి చేర్చాలని ప్రయత్నిస్తున్నాం. కోటి మంది ఆడ బిడ్డలను కోటీశ్వరులను చేయాలని కృషి చేస్తున్నాం.

**ఆడబిడ్డలు ఆశీర్వదిస్తే మరో 15..20 ఏళ్లు సీఎంగా..**

ఆడబిడ్డలు ఆశీర్వదిస్తే రేవంత్‌రెడ్డి మరో 15.. 20ఏళ్లు సీఎంగా కాంగ్రెస్ అధికారంలో ఉంటే .. తమ బతుకు బస్టాండ్ అవుతుందని భాజపా, భారాస నేతలు భయపడుతున్నారు. పదేళ్లుగా పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పండ బెట్టారని భారాస నేతలను అడుగుతున్నా. కృష్ణా జలాలను ఏపీ సర్కారు రాయలసీమకు కొల్లగొట్టుకు పోతుందంటే అందుకు కారణం కేసీఆర్. 811 టీఎంసీల్లో 511 టీఎంసీలు ఆంధ్రాకు తీసుకెళ్లండని కేసీఆర్ సంతకం పెట్టారు. ఆ సంతకమే ఇవాళ తెలంగాణ రైతాంగానికి శాపంగా మారింది. ఎస్ఎల్‌బీసీ పాపాల భైరవుడు కేసీఆర్ కాదా? పదేళ్లు భారాస పాలనలో ఎస్ఎల్‌బీసీ పనులు ఆగిపోవడం వల్లే కుప్పకూలింది. టన్నెల్‌లో 8మంది ప్రాణాలు పోవడానికి కారణం కేసీఆర్. కేసీఆర్‌ను నమ్మినందుకే పాలమూరు పడావు పడింది. అప్పుడే నన్ను దిగు..దిగు అని కేటీఆర్, హరీశ్‌రావు, కవిత అంటున్నారు. పాలమూరు రైతు బిడ్డ సీఎం అయితే చూసి ఓర్వలేరా? కేసీఆర్.. మీరు ఏలడానికి పుడితే.. మేం బిచ్చమెత్తుకునేందుకు పుట్టామా? పాలమూరు ప్రజలకు తెలివితేటలు లేవా? మీ మాదిరిగా మేం చదువుకోలేదా?

**కిషన్‌రెడ్డి సైంధవుడిలా అడ్డు పడుతున్నారు**

మామునూరు ఎయిర్ పోర్టు ప్రధాని మోదీ ఇచ్చారు.. నేనే తెచ్చానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెబుతున్నారు. అదే నిజమైతే.. మెట్రో రాలేదు, ఆపింది మోదీనే కదా? మూసీ ప్రక్షాళనకు నిధులు రాలేదు.. ఆపింది మోదీనే కదా?. రీజినల్‌రింగ్ రోడ్డు ఉత్తరభాగం నేనే తెచ్చానని కిషన్‌రెడ్డి చెబుతున్నారు. దక్షిణ భాగం ఆగిపోయింది. ఆపింది మీరే కదా? పాలమూరు రంగారెడ్డికి 60 టీఎంసీల నీటి కేటాయింపులు పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఆపింది మీరు కాదా? వస్తేనేమో ఆయన ఖాతాలో రాసుకుంటారు.. రాకపోతేనే రేవంత్‌రెడ్డి ఏం చేయలేదంటారు. సికింద్రాబాద్‌లో వరద బాధితులకు కిషన్‌రెడ్డి ఏం చేశారు. నా కంటే చిన్నోడు రాష్ట్రానికి సీఎం అయ్యిండని కిషన్‌రెడ్డికి కడుపుమంట. కిషన్‌రెడ్డీ.. మీ దగ్గర మోదీ, ఈడీ, సీబీఐ ఉండొచ్చు. ఎంతకాలం ఈడీ, సీబీఐని చూపించి బెదిరిస్తారు? మేం ఎవరికీ భయపడం. మోదీ మనకు ఏదో ఒకటి చేయాలనే ఆలోచనలోనే ఉన్నారు. మోదీ చేయాలనుకున్నా.. కిషన్‌రెడ్డి సైంధవుడిలా అడ్డు పడుతున్నారు. తన రహస్య మిత్రుడు దిగిపోయాడని కిషన్‌రెడ్డి బాధపడుతున్నారు.” అని సీఎం ప్రశ్నించారు.

# ఫిబ్రవరిలో 25 వేల ఉద్యోగాలు ఊస్ట్.. టెక్ కంపెనీలు సిబ్బందిని ఎందుకు తొలగిస్తున్నాయి..కారణాలివే




**హైదరాబాద్ పెన్ పవర్:**టెక్ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపుల పరంపర కొనసాగుతోంది. పెద్ద పెద్ద ఐటీ కంపెనీలు ప్రతినెలా తమ వర్క్ ఫోర్స్ ను తగ్గించుకుంటున్నాయి.ప్రపంచవ్యాప్తంగా ఉన్న మెటా, HP , వర్క్ డే , HCL, అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి అనేక టెక్, ఈకామర్స్ సంస్థలు లేఆఫ్స్ ప్రకటిస్తూనే ఉన్నాయి. తాజాగా ఫిబ్రవరిలో 46 కంపెనీలు దాదాపు 16వేల ఉద్యోగులను తొలగించాయి. జనవరిలో 5641 ఉద్యోగులను తొలగించబడ్డారు. జనవరితో పోలిస్తే ఫిబ్రవరిలో లేఆఫ్స్ భారీగా పెరిగాయి. ఫలితంగా ఉద్యోగుల సంఖ్యలో 184 శాతం తగ్గుదల కనిపిస్తోంది. అయితే పెద్ద పెద్ద కంపెనీలు కూడా లేఆఫ్స్ ప్రకటించడానికి గల కారణాలేంటి?..ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం మెటా ఫిబ్రవరిలో దాదాపు 3600మందిని తొలగించింది. HP 2వేల మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. మెటా,HP లకు మించి సేల్స్‌ఫోర్స్, వర్క్‌డే , ఆటోడెస్క్ వంటి కంపెనీలు తమ ఉద్యోగులలో ఎక్కువమందికి పింక్ స్లిప్‌ను ఇచ్చాయి. అయితే కంపెనీలు లేఆఫ్స్ ఎందుకు ప్రకటిస్తున్నాయి..? అంటే భారీ తొలగింపులకు దారితీసిన అనేక అంశాలు ఇక్కడ ఉన్నాయి. పెరుగుతున్న వడ్డీరేట్లు, ద్రవ్యోల్బణం ఒత్తిళ్లు, ఆర్థిక వ్యవస్థలో ఒడుదుడుకులు అనిశ్చితి ఆందోళనలు వ్యాపారులను ఆలోచనలో పడేస్తున్నాయి. చాలా కంపెనీలు తమ ఖర్చు తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఆర్థిక స్థిరత్వాన్ని కోరుకుంటున్నాయి. దీంతోపాటు కోవిడ్ సమయంలో ఓవర్ హైరింగ్ వల్ల అనేక సంస్థల్లో సిబ్బంది అధికమయ్యింది.ఇప్పుడు ఆదాయాలు తగ్గుతున్న క్రమంలో ఉద్యోగులను తగ్గించుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. మరో ప్రధాన అంశం.. ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్.. చాలా ఉద్యోగాలపై ప్రభావం పడుతోంది. ముఖ్యంగా కస్టమర్ సర్వీస్, HR, మార్కెటింగ్ వంటి ఉద్యోగాల్లో సిబ్బం ది అవసరం లేకుండా పోతోంది. దీంతోపాటు కొన్ని కంపెనీలు మెర్జింగ్, కంపెనీ ఆదాయాల్లో తగ్గుదల వంటి అంశాలు యాజమాన్యాన్ని పునరాలోచనలో పడేస్తోంది. కంపెనీలను లాభదాయకంగా కొనసాగించడానికి లేఆఫ్స్ ద్వారా ఖర్చులను తగ్గించుకునేలా చేసింది. మరోవైపు ఏరోస్పేస్, ఫైనాన్స్,ఇంధన రంగాల లోనూ తొలగింపులు ఉన్నాయి. కొంచెం భిన్నమైన నమూనాను నివేదించింది.

ఏరోస్పేస్ కంపెనీ అయిన లిలియం మొత్తం శ్రామిక శక్తిలో చాలా వరకు తగ్గించింది. 1,000 మంది ఉద్యోగులను తొలగిం చింది. డిసెంబర్, 2025 ప్రారంభంలో ఆర్థిక సవాళ్లను అంచనా వేస్తూ ఉద్యోగుల తగ్గింపులను చేపట్టింది. పరిశ్రమ వ్యాప్త మార్పును సూచించింది. ఉద్యోగుల తొలగింపులపై కొంతమంది విశ్లేషకులు అంచనాలు ఉద్యోగుల్లో కొంత ఊరట కలిగిస్తున్నాయి. 2025 మధ్య నాటికి ఉద్యోగుల తొలగింపు నెమ్మదిస్తుందని అంచనా వేశారు. కొంతమంది ఆర్థిక అనిశ్చితి కొనసాగితే మరిన్ని ఉద్యోగాల కోతలు ఉండవచ్చని భావిస్తున్నారు. మారుతున్న వ్యాపార మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఉద్యోగుల ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలని సూచిస్తున్నారు.

# ఈ మొక్కలు మీ ఇంట్లో ఉంటే.. ఏసీలు, కూలర్లతో పనిలేదు



**హైదరాబాద్ పెన్ పవర్:**మార్చి మొదలైందో లేదో పూర్తవకముందే ఎండలు దంచి కొడుతున్నాయి. బయట ఉన్నా, ఇంట్లో ఉన్నా ఉక్కపోతతో తిప్పలు తప్పట్లేదు. అందుకే పోయినేడు మూలకేసిన కూలర్లను బయటికి తీస్తున్నరు. ఏసీలకు సర్వీస్ చేయిస్తున్నరు. కానీ.. అవేవీ లేకున్నా ఇంటిని చల్లగా మార్చుకోవచ్చు అంటున్నరు ఎక్స్‌పర్ట్స్. ఇంటిని చల్లబరిచేందుకు ప్రత్యేకంగా కొన్ని రకాల మొక్కలు ఉన్నయ్. వాటిని ఇంటికి తెచ్చుకుంటే ఏసీలతో పనిలేదని పర్యావరణ నిపుణులు చెప్తున్నారు. ఇవి ఇంటిని చల్లగా ఉంచడమే కాకుండా గాలిని శుద్ధి చేసి..ఆక్సిజన్‌ను పెంచుతాయి. పైగా కరెంట్ బిల్లుల మోత కూడా తగ్గుతుంది. ఇంతలా మేలు చేసే ఆ మొక్కలేంటంటే..

**మనీప్లాంట్**

మల్లె తీగలా అల్లుకొని, పైకి ఎగబాకే ఈ మనీ ప్లాంట్ ను చాలామంది గుమ్మం ముందు పెంచుకుంటారు. మరికొందరు ఇంటి లోపల కూడా పెట్టుకుంటారు. ఈ చెట్టు పెంచితే డెకరేషన్ చేసినట్టు ఇల్లంతా అందంగా కనిపిస్తుంది. ఇది ఇంటిని చల్లగా మారుస్తుంది. గాలిని ఫిల్టర్ చేసి కాలుష్యాన్ని తగ్గించేస్తుంది. దీన్ని ఇంట్లో పెంచుకోవడం వల్ల స్వచ్ఛమైన, తాజా గాలిని పీల్చుకోవచ్చు.

**స్నేక్‌ప్లాంట్**

ఇది అచ్చం పాములాగే ఉంటుంది. ఈ మొక్కలో నీటి శాతం ఎక్కువ. వేడి గాలిని పీల్చుకుంటుంది. కిటికీ దగ్గర ఈ మొక్కలను ఉంచితే.. వాటి గుండా వచ్చే గాలి చల్లగా మారుతుంది. ఇది ఇంటికి అందాన్ని ఇవ్వడమే కాదు.. ఇంట్లోవాళ్లకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఇస్తుంది. స్నేక్ ప్లాంట్ పగటి పూట గాలిని శుద్ధి చేసి.. రాత్రి సమయాల్లో ఆక్సిజన్ విడుదల చేస్తుంది. దీని వల్ల గాలిలోని టాక్సిన్లు తొలగిపోతాయి. ఈ మొక్క ఇంట్లో పెంచుకోవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, హాయిగా నిద్ర పడుతుందని నిపుణులు చెప్తున్నారు.

**బాంబూ పామ్..**

బాంబూ పామ్ మొక్కను ఎక్కువగా ఇల్లు, ఆఫీసుల్లో అలంకరణ కోసం పెంచుతుంటారు.ఈ మొక్క ఏ ఇంట్లో ఉంటే ఆ ఇల్లు చాలా అందంగా కనిపిస్తుంది. దీనికి ఉండే పెద్ద పెద్ద ఆకుల వల్ల చల్లదనం పెరుగుతుంది. విష వాయువుల్ని పీల్చుకునే గుణం కూడా వీటికి ఉంటుంది.

**రబ్బరు మొక్క**

రబ్బర్ మొక్కకు పెద్ద పెద్ద ఆకులు ఉంటాయి. ఆకులు పెద్దగా ఉండటం వల్ల ఇది ఎక్కువ చల్లదనాన్నిస్తుంది. ఈ మొక్క ఉండే నేల మరీ తడిగా, మరీ పొడిగా లేకుండా జాగ్రత్త పడాలి. తరచూ నీరుపోస్తుండాలి. ఈ మొక్క నీటిని తక్కువగా తీసుకుంటుంది. అయితే, ఈ మొక్కను మంచి నేలలో, తక్కువ వెలుతురు పడే ప్రదేశంలో పెంచాలి.

**స్పైడర్ ప్లాంట్**

ఇది ఎక్కడైనా హాయిగా పెరుగుతుంది. ఇంట్లో చల్లదనం పెంచి, వేడిని తగ్గిస్తుంది. ఈ మొక్క కూడా ఇంటికి ఆకర్షణీయంగా ఉంటుంది. దీన్ని ఇండోర్‌లో పెంచుకోవచ్చు. ఈ మొక్క ఇంట్లో ఉంచడం వల్ల గాలిలోని మలినాలు తొలగిపోతాయి. వీటిని సంరక్షించడం చాలా సులువు. వీటికి నీటి అవసరం కూడా తక్కువే. చిన్న చిన్న కుండీల్లో కూడా పెంచుకోవచ్చు.

**కలబంద**

ఈ రోజుల్లో కలబంద మొక్క లేని ఇల్లంటూ ఉండదు. కలబందను ఆయుర్వేదంలో ఎక్కువగా వాడుతుంటారు. కాస్మొటిక్స్ తయారీలోనూ వాడుతున్నారు. నీటితోనిండిన ఈ మొక్క గాలిలో వేడిని బాగా తగ్గిస్తుంది.చాలామంది దీని ఆకుల నుంచి తీసిన జెల్ నుముఖం, జుట్టు సంరక్షణ కోసం ఉపయోగిస్తారు.జీర్ణ సమస్యలు ఉన్నవారు కలబంద రసంతాగుతుంటారు. ఇలా ఆరోగ్యానికి ఎంతోమేలు చేసే కలబంద ఇంట్లో టెంపరేచర్లను కూడా తగ్గిస్తుంది. ఇది గాలిలోని టాక్సిన్లను తొలగించి శుద్ధి చేస్తుంది.

**అరెకా తాటి చెట్టు**

దీన్ని అరెకా పామ్ అని కూడా అంటారు. ఈ మొక్కచూడటానికి చాలా అందంగా ఉంటుంది. ఇది కాస్త ఎక్కువ స్థలాన్ని తీసుకుంటుంది. దీన్ని మొదట నేలలో పాతి, కాస్త పెరగ్గానే కుండీల్లోకిమార్చుతారు. ఇది కూడా చెడుగాలిని స్వచ్ఛంగా మారుస్తుందని నాసా పరిశోధనలో తేలింది. అరెకా చెట్టు అత్యంత ప్రజాదరణ పొందిన లివింగ్ రూమ్ మొక్కల్లో ఒకటి. ఈ మొక్క గాలిని చల్లగా, తేమగా ఉంచడంలో సాయపడుతుంది. సమ్మర్‌లో ఈ మొక్క వేడి నుంచి ఉపశమనం కల్పిస్తుంది. ఇంటి వాతావరణాన్ని చల్లబరుస్తుంది. అంతేకాకుండా స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తుంది.

**బోస్టన్ ఫెర్న్ మొక్క**

ఇంటిని చల్లగా ఉంచడానికి ఫెర్న్ మొక్కలను కూడా నాటుకోవచ్చు. కలుషిత గాలిని శుభ్రపరచడం ఇవి చేసే ముఖ్యమైన పని. దీనివల్ల ఉక్కపోత సమస్య నుంచి ఉపశమనం దొరుకుతుంది. ఇది గాలిలోని తేమను నిలుపుకోవడంలో సాయపడుతుంది. దీంతో, ఇంటిని చల్లగా ఉంచుతుంది. గాలిలో టాక్సిన్స్‌ను తొలగించి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తుంది. ఈ మొక్కకు ఎండ తగలకుండా చూసుకోవాలి.

**పోథోస్**

దీన్ని డెవిల్స్ ట్రీ అని కూడా పిలుస్తుంటారు. దీన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం లేదు. దానంతట అదే పెరుగుతుంది. ఆకులు హృదయం ఆకారంలో ఉంటాయి. ఇది కూడా ఇంటిని చల్లబరుస్తుంది. దీని ఆకులు పెద్దగా ఉంటాయి. అందువల్ల చల్లదనాన్ని ఎక్కువగా అందిస్తుంది.

**చైనీస్ ఎవర్‌గ్రీన్**

పెద్ద పెద్ద ఆకులతో చూడడానికి చాలా అందంగా ఉంటుంది. ఇది ఎప్పటికీ ఆకుపచ్చగా ఉంటూ చల్లదనాన్ని ఇస్తుంది. నీటిని సైతం తక్కువగా తీసుకుంటుంది. ఈ మొక్క వేడి గాలులను పీల్చుకొని వాతావరణాన్ని చల్లబరుస్తుంది.

**పీస్ లిల్లీ**

పీస్ లిల్లీ మొక్క బాగా పెరిగితే ఆకులు పెద్దగా అవుతాయి. ఇది తక్కువ టైంలోనే ఇంట్లోని గాలిని చల్లబరుస్తుంది. కాకపోతే ఈ మొక్క మీద ఎక్కువగా ఎండ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది కూడా గాలిలోని మలినాలు తొలగించి ఎయిర్ క్వాలిటీని పెంచుతుంది.

**బెంజిమిన్ ఫైకస్**

చిన్న చిన్న కుండీల్లో ఈ మొక్కలను పెంచొచ్చు. ఇవి ఇంట్లో ఎన్ని ఎక్కువ ఉంటే... అంత చల్లగా ఉంటుంది. తక్కువ నీటిని తీసుకుని ఎక్కువ చల్లదనాన్ని ఇస్తాయి.

# తిరుమల కొండపై వసతి గదుల కేటాయింపులో కొత్త రూల్... గమనించారా?




**హైదరాబాద్ పెన్ పవర్:**తిరుమల కొండపై వీఐపీలకు వసతి గదుల కేటాయింపు విధానంలో టీటీడీ కొత్త రూల్ తీసుకువచ్చింది. ఇకపై వీఐపీలు దర్శన టికెట్ తీసుకుని వస్తేనే వారికి తిరుమలలో వసతి గదులు కేటాయించనున్నారు. టీటీడీ ఈ నిర్ణయం తీసుకోవడానికి గట్టి కారణమే ఉంది. తిరుమల కొండపైకి వచ్చే యాత్రికులకు వసతి కల్పించేందుకు టీటీడీ 7,500 గదులను అందుబాటులో ఉంచింది. వీటిలో 3,500 గదులను సామాన్య భక్తులకు కేటాయిస్తారు. అడ్వాన్స్ బుకింగ్ కింద 1,580 గదులు, టీటీడీకి విరాళాలు ఇచ్చే భక్తులకోసం 400 గదులు, ఆన్ అరైవల్ కింద మరో 450 గదులు కేటాయిస్తున్నారు. మిగిలిన గదులను కరెంట్ బుకింగ్ విధానంలో వీఐపీల కోసం కేటాయిస్తున్నారు. అయితే, వీఐపీలకు కేటాయించే ఈ గదులను దళారీలు ఆధార్ కార్డుల ద్వారా పొంది, వారి అధీనంలో ఉంచుకునేవారు. ఈ గదులను రెండ్రోజుల పాటు ఉపయోగించుకునే వీలుండడంతో... రోజుకు ఒక భక్తుడికి చొప్పున, లేకపోతే ఇద్దరు ముగ్గురు భక్తులకు కలిపి ఈ గదులను అద్దెకు ఇస్తూ దళారీలు పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. దాంతో దళారీ వ్యవస్థకు చెక్ పెట్టేందుకు టీటీడీ తాజా నిబంధన తీసుకువచ్చింది. ఇకపై దర్శన టికెట్ ఉన్న వీఐపీ వస్తేనే ఈ గదులు కేటాయిస్తారు. పద్మావతి విచారణ కేంద్రం, ఎంబీసీ, టీబీ కౌంటర్లలో ఆధార్ కార్డు, దర్శన టికెట్ ను చూపించి వీఐపీలు ఈ గదులు పొందాల్సి ఉంటుంది. ఈ విధానం ఎంతో మెరుగైన ఫలితాలు ఇస్తోందని టీటీడీ వర్గాలు చెబుతున్నాయి.

# పదవీ విరమణ చేసిన వెంటనే SEBI మాజీ చీఫ్ మదాబి పై FIR..




**హైదరాబాద్ పెన్ పవర్:**అప్పటి దాకా వేల కంపెనీలను తన కనుసన్నలలో నడిపించి.. ఎన్నో కంపెనీలు మార్కెట్ లో లిస్ట్ అయ్యేందుకు పర్మిషన్ ఇచ్చి.. ఇండియన్ స్టాక్ మార్కెట్ కు బాస్ గా వ్యవహరించిన సెబీ మాజీ చీఫ్ మదాబి పురి బుచ్.. మూడేళ్ల పదవీ కాలం ముగియగానే (మార్చి 1తో).. పరిస్థితులు తిరగబడుతున్నాయి. ఇండియన్ స్టాక్ మార్కెట్ లో T+1 సెటిల్ మెంట్, ASBA విధానంలో కచ్చితత్వం, చార్జెస్ మోసాలకు అడ్డుకట్ట వేయడం వంటి ఇన్వెస్టర్లు మెచ్చిన నిర్ణయాలు తీసుకున్న SEBI మాజీ చీఫ్ మదాబి పురి బుచ్ పై ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలు జారీ చేసింది ముంబై స్పెషల్ కోర్టు. స్టాక్ మార్కెట్ లో పెద్ద ఫ్రాడ్ కు కారకులయ్యారని ఆమెపై FIR నమోదు చేయాల్సిందిగా ముంబై కోర్టు ఆదేశించడం సంచలనంగా మారింది. ముంబైలోని స్పెషల్ కోర్టు మదాబితో పాటు ఇతర అధికారులు, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ పై (BSE) ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఆమె ఆధ్వర్యంలో స్టాక్ మార్కెట్ లో భారీ అవకతవకల జరిగాయని చర్యలు తీసుకోవాల్సిందిగా వేసిన పిటిషన్ పై విచారించిన కోర్టు ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలు ఇచ్చింది. ఓ కంపెనీ స్టాక్ మార్కెట్ లో లిస్ట్ అయ్యేందుకు సహకరించారని, ఎలాంటి రెగ్యులేటరీ నిబంధనలు అందుకోలేని కంపెనీ లిస్ట్ అయ్యేందుకు అనుమతించారని, ఫండమెంటల్స్ సరిగా లేని కంపెనీ వలన ఎందరో ఇన్వెస్టర్లు నష్టపోయారని పిటిషనర్ ఆరోపించారు. ఇన్ సైడర్ ట్రేడింగ్, నిధుల మళ్లింపు, కార్పోరేట్ ఎంటిటీస్ కు లాభం కలిగించేలా వ్యవహరించారని, చర్యలు తీసుకోవాలని పిటిషనర్ పేర్కొన్నాడు.

ఈ పిటిషన్ పై విచారణ జరిపిన శశికాంత ఏక్ నాథరావ్ బంగర్, విచారణకు ఆదేశించారు. అదేవిధంగా 30 రోజుల్లో కేసు పురోగతిని తెలియజేయాలని ఆదేశించారు. సెబీ రూల్స్ కు విరుద్ధంగా, మార్కెట్ ప్రమాణాలు అందుకోని కంపెనీని లిస్ట్ చేసి అవినీతికి పాల్పడ్డారని, దీన్ని అడ్డుకోవడంలో సెబీ చీఫ్ మదాబితో పాటు ఇతర అధికారులు, బీఎస్ఈ సీఈవో విఫలమయ్యారని, తెలిసే లిస్టింగ్ కు అనుమతి ఇచ్చారని ఒక మీడియా జర్నలిస్ట్ పిటిషన్ వేశారు. ఈ అంశంపై ఎన్నో ఫిర్యాదులు వచ్చాయని, కానీ సెబీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పిటిషన్ లో పేర్కొన్నారు. సెబీ చైర్ పర్సన్ మదాబి పురి బుచ్, ఇతర అధికారులు అశ్వని భాటియా, అనంత్ నారాయణ్, కమ్లేశ్ చంద్ర వర్ష్ని, అదే విధంగా %దీూజు% చైర్మన్ ప్రమోద్ అగర్వాల్, సీఈఓ సుందరరామన్ రామమూర్తి మొదలైన వారి పేర్లను పిటిషన్ లో పేర్కొన్నారు. వీరందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టాల్సిందిగా స్పెషల్ కోర్ట్ ఆదేశించింది.

**మదాబి హయాంలో వచ్చిన ముఖ్యమైన మార్పులు:**

ఇండియన్ స్టాక్ మార్కెట్ లో T+1 సెటిల్ మెంట్ (ట్రేడ్ చేసిన రోజే స్టాక్స్ లేదా డబ్బులు అకౌంట్లోకి రావడం), ASBA విధానంలో కచ్చితత్వం ( ఏదైనా IPO కి అప్లై చేసినపుడు అది ప్రాసెస్ అయిన తర్వాతనే అకౌంట్ లో డబ్బులు బ్లాక్ అవ్వడం), చార్జెస్ మోసాలకు అడ్డుకట్ట (ఇన్వెస్టర్ల నుంచి ఎక్స్ చేంజ్ చార్జీలు వసూలు చేసే బ్రోకరేజ్ కంపెనీలు.. ఆ చార్జీలను ఎక్స్ఛేంజ్ కు ఇవ్వకపోవడం) మొదలైన సంచలన నిర్ణయాలతో మార్కెట్ ను కొత్త పుంతలు తొక్కించారు. సెబీ చీఫ్ గా కొన్ని అద్భుతమైన నిర్ణయాలు తీసుకున్నప్పటికీ.. కంపెనీలకు పరోక్షంగా సహకారం అందించారని, దాని వల్ల కంపెనీలు, కార్పోరేట్లు లాభపడ్డారని, కానీ ఇన్వెస్టర్లు నష్టపోయారనే ఆరోపణలు ఆమెపై ఉన్నాయి. అందులో భాగంగా ఆమెపై దాఖలైన పిటిషన్ ఆధారంగా విచారణకు ఆదేశించింది స్పెషల్ కోర్టు.

# హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్స్ హల్‌చల్..10 మంది అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్న ట్రాన్స్ జెండర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పీటీ కాలనీ, కట్టకింద కల్లు కాంపౌండ్ దగ్గర నివాసం ఉంటున్న 10 మంది ట్రాన్స్‌జెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు శనివారం (మార్చి1) రాత్రి రైడ్స్ నిర్వహించారు. పీఅండ్ టీకాలనీ, కట్టకింద కల్లు కాంపౌండ్ ప్రాంతంలో ట్రాన్స్‌జెండర్స్ అసాంఘిక కార్యకలాపాలతో రెడ్ లైట్ ఏరియాగా మార్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు రైడ్స్ చేశారు. వీరు ఎక్కడి నుంచి వచ్చారు.. ఎంత కాలంనుంచి ఇక్కడు ఉంటున్నారనేదానిపై ఆరాతీస్తున్నారు. విచారణ అనంతరం రిమాండ్ తరలించనున్నారు.

# అర్ధరాత్రి వైన్స్ లో చోరీ.. డబ్బులతో పాటు బీర్లు కూడా పట్టుకెళ్లారు..



**హైదరాబాద్ పెన్ పవర్:**వికారాబాద్ జిల్లా పెరిగిలోని భవాని వైన్ షాపులో శనివారం ( మార్చి 2, 2025 ) అర్ధరాత్రి చోరీ జరిగింది. వైన్ షాపు కౌంటర్లో డబ్బులతో పాటు బీర్లు కూడా పట్టుకెళ్లారు కేటుగాళ్లు. వైన్ షాపుకు ఉన్న తాళాలు కట్ చేసి లోపలికి దూరిన దొంగలు కౌంటర్లో దాదాపు రూ. 2 లక్షల 30 వేల రూపాయలు నగదు దోచుకెళ్లినట్లు తెలుస్తోంది. డబ్బులతో పాటు పోతూ పోతూ రెండు బీర్లు కూడా పట్టుకెళ్లారని వైన్ షాపు సిబ్బంది చెబుతున్నారు.

రాత్రి షాపు మూసే సమయానికి లెక్కలు చూసి తాళాలు వేసి వెళ్ళిపోయామని...మళ్ళీ ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయని తెలిపారు సిబ్బంది. దొంగల కదలికలన్ని సిసి కెమారాల్లో రికార్డయ్యాయి.వైన్స్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు పోలీసులు. సిసి ఫుటేజ్ ఆధారంగా, క్లూస్ టీం సహాయంతో దర్యాప్తు చేస్తున్నారు. వీకెండ్ పరిగిలో ఏదోఒక చోట చోరీలు జరగడం సర్వసాధారణంగా మారిందని అంటున్నారు.

## బీఎస్పీ నుంచి మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను తొలగించిన మాయావతి




**హైదరాబాద్ పెన్ పవర్:** బహుజన్ సమాజ్ వాదీ పార్టీ అధినేత మాయావతి సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీఎస్పీ నుంచి తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను ఆమె తొలగించారు. అన్ని పదవుల నుంచి ఆకాష్‌ను మాయావతి తొలగించడం చర్చనీయాంశమైంది. బీఎస్పీ జాతీయ స్థాయి సమావేశం ఆదివారం లక్నోలో జరిగింది. ఈ సమావేశంలోనే ఆకాష్ ఆనంద్‌ను పార్టీ నుంచి తొలగించినట్లు మాయావతి బీఎస్పీ నేతలకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాజకీయ వారసత్వంపై మాయావతి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను బతికున్నంత వరకూ బీఎస్పీ రాజకీయ వారసత్వం అందిపుచ్చుకునే అవకాశం ఏ ఒక్కరికీ ఇవ్వడం జరగదని, ఆ ప్రస్తావనే రాదని మాయావతి కుండబద్ధలు కొట్టారు. ఆకాష్ ఆనంద్ తండ్రి ఆనంద్ కుమార్ ను పార్టీ ప్రధాన కార్యదర్శిగా మాయావతి నియమించారు. రాజ్యసభ ఎంపీ రామ్ జీ గౌతమ్‌ను కొత్త నేషనల్ కోఆర్డినేటర్‌గా బీఎస్పీ అధినేత్రి నియమించడం గమనార్హం. ఆకాష్ ఆనంద్ మామ, మాజీ రాజ్యసభ ఎంపీ అశోక్ సిద్ధార్థ్‌ను పార్టీలో వర్గ పోరును ప్రోత్సహిస్తున్నాడనే కారణంగా మాయావతి బీఎస్పీ నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే. అయితే.. బీఎస్పీని బలహీనపరచడమే లక్ష్యంగా ఆకాష్ ఆనంద్‌ను తన మామ అశోక్ సిద్ధార్థ్ ప్రోత్సహిస్తున్నాడని, ఆనంద్ రాజకీయ జీవితం తన మామ వల్ల ప్రభావితం అయిందని.. అందుకే ఆకాశ్ ఆనంద్‌ను బీఎస్పీ నుంచి తొలగిస్తున్నామని మాయావతి కీలక ప్రకటన చేశారు.

## యాదగిరిగుట్ట ఆలయంలో రూ.24 లక్షలతో గరుడ, శేష వాహన సేవలకు బంగారు తాపడం..




**హైదరాబాద్ పెన్ పవర్:** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో రెండు వాహన సేవలకు బంగారు తాపడం చేయించారు. రూ. 24 లక్షల రూపాయలతో దాతల సహకారంతో శేష, గరుడ వాహన సేవలకు బంగారు తాపడం పూర్తయినట్లు ఈవో తెలిపారు. సాయి పావని కన్స్ట్రక్షన్స్, గార్లపాటి పెద్ద యాదయ్య కుటుంబ సభ్యుల సహకారంతో వాహన సేవలకు బంగారు తాపడం చేయించారు. అదే విధంగా దాతలు స్వామి వారి సేవా పీఠాన్ని తయారు చేసి ఆలయానికి బహుకరించారు. హైదరాబాద్ కి చెందిన అనురాధ టీంబర్ డిపో యాజమాన్యం నాలుగు లక్షల రూపాయలతో బర్మా టెక్ తో తయారు చేసి ఆలయానికి బహుకరించారు.

## ఎర్రటి.. తియ్యటి పుచ్చకాయను గుర్తించడం ఎలా..



**హైదరాబాద్ పెన్ పవర్:** సమ్మర్ మొదలైంది.. ఎండలు మండుతున్నాయి.. కూల్ కూల్‌గా పొట్టలో ఏదో ఒకటి పడేయాలనుకుంటాం. అందుకే ఈ సీజన్‌లో పుచ్చకాయ ( %ఝ్వతీ ఎవశ్రీశీఅ%) కు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. అయితే వ్యాపారస్తులు రంగు రావడానికి రసాయనాలను ఉపయోగిస్తుంటారు.. రుచికి రుచి.. ఆరోగ్యానికి .. ఆరోగ్యం..ఇచ్చే పుచ్చకాయ ... కల్తీ అయిందా.. ఆరోగ్యం మాట కాస్త పక్కన బెడితే అనారోగ్యం కంపల్సరీ.. మరి రసాయనాలు లేని పుచ్చకాయను ఎలా గుర్తించాలో తెలుసుకుందాం. .

వేసవి దగ్గరకు వచ్చింది. ఈ సీజన్‌లో ఎక్కువ డిమాండ్ ఉండేది పుచ్చకాయలకు. అయితే వీటికి రంగు రావడానికి కొన్ని రసాయనాలు కలుపుతూ ఉంటారు. వాటిని గుర్తించాలి. ఇలాంటి పుచ్చకాయ తింటే ఆరోగ్యమేమో కాని... అనారోగ్యం మాత్రం తప్పక వస్తుంది. . పుచ్చకాయ లోపల ఉండే ఎర్రటి గుజ్జు తియ్యటి రుచితో ఉండి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వాటర్ మిలాన్ గుండె జబ్బులు, మధుమేహం, కొన్ని రకాల క్యాన్సర్‌ల నుండి రక్షణ కలిగిస్తుంది. అందుకే కల్తీ లేని పుచ్చకాయను తినాలి. పుచ్చకాయను కోసి ఇంటికి తీసుకెళ్లేలోపు పాడయిపోయే అవకాశం ఉంది. పుచ్చకాయను ఇంగ్లీషులో వాటర్‌మిలన్ అంటారు . అంటే దీనిలో పేరుకు తగినట్లుగా 91 శాతం నీరే ఉంటుంది. కాబట్టి ఈ పండు వేసవిలో తినడం చాలా మంచిది. ఇందులో కేలరీలు తక్కువ ఉంటాయి, ఫైబర్ ఎక్కువ ఉంటుంది. కాబట్టి పుచ్చకాయ తింటే కడుపు నిండుతుంది, దాహం తీరుతుంది, మంచి పోషకాలు శరీరానికి అందుతాయి

**బరువున్న పుచ్చకాయ:** పుచ్చకాయను కొనేటప్పుడు బరువును పరిశీలించాలి. దానిని పట్టుకుంటే బరువుగా ఉండాలి. బరువుగల వాటర్ మిలాన్ మాత్రమే పండుతుంది. రసాయనాలతో పండించిన పుచ్చకాయ చాలా తేలికగా ఉంటుంది. ఎంత బరువు ఉంటే అంత ఎక్కువగా నీరు.. ఎర్రటి గుజ్జు ఉంటుంది. కాబట్టి పుచ్చకాయను బరువుగా ఉంటే తీసుకోండి.

**చేతితో తట్టి చూడండి:** పండిన పుచ్చకాయను చేతితో తట్టినప్పుడు సౌండ్ బాగా వస్తుంది. తోలు మందంగా ఉంటుంది. పుచ్చకాయ పండితే చేతితో తట్టినప్పుడు బోలు శబ్దం వస్తుంది.

**పుచ్చకాయ ఆకారం:** వివిధ రకాలైన.. వివిధ రకాలైన పరిమాణాలతో పుచ్చకాయలను మార్కెట్లో అమ్ముతుంటారు. కొన్ని గుండ్రంగా ఉంటాయి.. మరికొన్ని కోడిగుడ్డు ఆకారంలో ఉంటాయి. ఎలా ఉన్నా పరవాలేదు కాని ఒకే ఆకారంలో ఉన్న వాటర్ మిలాన్ తీసుకోవాలి. ఎక్కువ తక్కువలు ఉండకూడదు. ఒకవేళ అలా ఉంటే కచ్చితంగా రసాయనాలతో పండించినట్లేనని గుర్తించాలి.

**పసుపు మచ్చలు ఉండాలి:** వాటర్ మిలాన్ కొనేటప్పుడు అన్నివైపులా తిప్పి చూస్తే, దానిపై పసుపు రంగు మచ్చ కనిపించాలి. తీగపైనే పుచ్చకాయ పక్వానికి వస్తే దానిపై పసుపు మచ్చలు ఉంటాయి. అంతేకాదు అలాంటి పండు చాలా తియ్యగా ఉంటుంది. ఫీల్డ్ స్పాట్ లేదా గ్రౌండ్ స్పాట్ అని కూడా పిలుస్తారు. అదే రసాయనాలతో పండిస్తే తెల్లటి మచ్చలు ఉండి .. జ్యూస్ తక్కువగా ఉండటమే కాకుండా .. రుచి చప్పగా ఉంటుంది.

**రంధ్రాలు గమనించండి:** పుచ్చకాయను .. కాయ మాదిరిగానే కొనాలి.. ముక్కలు చేసిన కాయను కొనకూడదు. కొంతమంది వ్యాపారులు పుచ్చకాయను పండించడానికి సూదితో ఇంజెక్షన్లు చేస్తారు. కాబట్టి అలాంటి రంధ్రాలు ఉన్నాయోమో గమనించి, రంధ్రాలు లేని పండును తీసుకోండి.

**శరీరంపై దుష్ప్రభావాలు:** రసాయనాలతో (కార్బైడ్‌తో ) చేసిన పండ్లను తినడం వల్ల కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటుంది. మిథనాల్ కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. క్రోమేట్ కడుపు సమస్యలు, రక్తహీనత, మెదడు దెబ్బతినడం, సంతానోత్పత్తి తగ్గడం వంటి సమస్యలను కలిగిస్తుంది. మనం ఆరోగ్యంగా ఉండాలంటే పండ్లను తింటాం. కానీ మనం తినే పండ్లు శరీరానికి హాని కలిగించే అవకాశం ఉంది. ఎందుకంటే లాభం కోసం పండ్లపై రసాయనాలు వాడుతున్నారు. రసాయన రహిత పండ్లు తినడం మాత్రమే ఆరోగ్యానికి మంచిది. పసుపు మచ్చలుండే, గట్టి ( బరువు) పుచ్చకాయను ఎంచుకొని, తొడిమ ప్రాంతం ఎండిందో లేదో చూసి కొనుక్కోండి. అప్పుడు దాన్ని కట్ చెయ్యకపోయినా లోపల ఎర్రగానే ఉంటుందని పరిశోధకులు తేల్చారు. కట్ చెయ్యని పుచ్చకాయని ఇంట్లో (ఫ్రిజ్‌లో లేదా ఎండ తగలని చోట) ఓ రెండ్రోజులు ఉంచినా పాడవదు. కాబట్టి పుచ్చకాయ కొనేటప్పుడు పైన చెప్పిన విషయాలను గుర్తుంచుకోండి.

## 'మహాలక్ష్మి'కి రూ. 5,500 కోట్లు కేటాయించాలి

రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి భారీ ఎత్తున నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ఆ సంస్థ విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన రెండో రోజు నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అందించే 'మహాలక్ష్మి' పథకాన్ని ఆర్టీసీ అమలు చేస్తోంది. రద్దీ ఎక్కువైన నేపథ్యంలో ప్రయాణికులకు ఉపశమనం కలిగించేందుకు, డిమాండ్ ఉన్న రూట్లలో నడిపేందుకు కనీసం 1,500 కొత్త బస్సులు కొనుగోలు చేయాలన్నది ఆర్టీసీ లక్ష్యం. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. దీంతోపాటు విద్యార్థులకు రాయితీ బస్‌పాస్‌లు, కొత్త బస్సుల కొనుగోలుకు అవసరమయ్యే నిధులను రాష్ట్ర ప్రభుత్వమే బడ్జెట్‌లో కేటాయించాలని ఆర్టీసీ యాజమాన్యం కోరింది. మొత్తంగా రూ. 8,110 కోట్లు..

బడ్జెట్‌లో కేటాయించాలంటూ ఆర్టీసీ ఇచ్చిన మొత్తం ప్రతిపాదనల విలువ రూ. 8,110 కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీకి సుమారు రూ. 1,200 కోట్లు రావాల్సి ఉందని, ఆ డబ్బును బడ్జెట్‌లో కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కొద్దిరోజుల క్రితం కలిసి ఆర్టీసీ ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఇటీవల సమావేశమై బడ్జెట్ కేటాయింపుల విషయంలో ఆర్థిక మంత్రితో మాట్లాడాలని కోరినట్లు సమాచారం. 'మహాలక్ష్మి' పథకం కింద అందిస్తున్న ప్రయాణాల విలువ నెలకు రూ. 455 కోట్లకుపైనే అని.. ఈ లెక్కన 2025–26 బడ్జెట్‌లో రూ. 5,500 కోట్లు కేటాయించాలని కోరినట్లు తెలుస్తోంది. 1,500 కొత్త బస్సుల కొనుగోలుకు ఒక్కోదానికి రూ. 40 లక్షల చొప్పున రూ. 600 కోట్లు కావాలని అడిగారు. విద్యార్థుల బస్‌పాస్, రీయింబర్స్‌మెంట్లకు రూ. 430 కోట్లు, ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 540 కోట్లు, బస్‌డిపోలు, బస్టాండ్‌ల అభివృద్ధికి రూ. 40 కోట్లు అందించాలని కోరారు. కార్మికులకు సంబంధించి సీసీఎస్, పీఎఫ్ డబ్బుల్ని ఆర్టీసీ యాజమాన్యం సంస్థ అవసరాలకు వాడేసింది. ఈ మొత్తాన్ని సర్దుబాటు చేయడం యాజమాన్యానికి తలకు మించిన భారంగా ఉంది. వన్‌టైం సెటిల్మెంట్ కింద ఆర్టీసీకి రూ. 1,000 కోట్లు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఆర్టీసీకి 2024–25 బడ్జెట్‌లో రూ. 4,084 కోట్లు కేటాయించగా ఫిబ్రవరి రెండో వారం వరకు రూ. 2,900 కోట్లు వచ్చాయి. మార్చి 31కి ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో మిగిలిన రూ. 1,184 కోట్లు రాబట్టాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

# ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద ఫిబ్రవరి 22న జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది గల్లంతవడం తెలిసిందే. వారు బతికుండే అవకాశాలు పూర్తిగా అడుగంటిపోయాయి. మృతదేహాల వెలికితీతకు సహాయక చర్యలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇవాళ 9వ రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ, నేవీ, ర్యాట్ హోల్ మైనర్స్, పోలీసులు, హైడ్రా టీమ్, సింగరేణి బృందం, పలు ప్రైవేటు కన్ స్ట్రక్షన్ కంపెనీల బృందాలు తవ్వకాలు ముమ్మరం చేశాయి. కాగా, ఇవాళ నాలుగు మృతదేహాలు వెలికితీసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిరంతరంగా నీటి ఊట వస్తుండడంతో తవ్వకాలకు అడ్డంకిగా మారుతోంది. పూడికను, కత్తిరించిన టన్నెల్ బోరింగ్ మెషీన్ భాగాలను బయటికి తరలించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కన్వేయర్ బెల్ట్ ఇప్పటికీ అందుబాటులోకి రాకపోవడంతో సహాయక చర్యల్లో ఆశించిన వేగం కనిపించడంలేదు!



కాగా, సహాయక బృందాలు షిఫ్టుకు 120 మంది చొప్పున 3 షిఫ్టుల్లో పనిచేస్తున్నాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, సింగరేణి బృందాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి. సహాయక చర్యల్లో మొత్తం 18 ఏజెన్సీలు, 700 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

# సినీ ట్రిక్కులతో మరిన్ని చిక్కులు.. లాజిక్కు తెలుసుకో పోసాని



**హైదరాబాద్ పెన్ పవర్:**సినీ నటుడు, వైసీపీ నేత పోసాని క్రిష్ణమురళి కేసులో సినీ ట్విస్టులు రాజకీయంగా ఆసక్తికరంగా మారుతున్నాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం రఘురామ కేసులో ఆయన సినీ డ్రామాలు ఆడుతున్నారని పోలీసులు చెబుతుండటంతో పోసాని మరిన్ని చిక్కులను ఎదుర్కొంటున్నారా? అనే చర్చ మొదలైంది. ప్రస్తుతం 14 రోజుల రిమాండులో ఉన్న పోసానిపై రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17 కేసులు ఉన్నాయి. ప్రస్తుత కేసులో ఆయనకు బెయిల్ వచ్చినా మరో కేసులో అరెస్టు చేసే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే తనకు అనారోగ్యం ఉందని పోసాని, ఆయన ఆరోగ్యం బాగుందని పోలీసులు భిన్నవాదనలు వినిపిస్తుండటమే ఆసక్తి రేపుతోంది. సినీ నటుడు పోసాని క్రిష్ణమురళిని ఎట్టిపరిస్థితుల్లో క్షమించే పరిస్థితి కనిపించడం లేదని తాజా అప్డేట్స్ ధ్రువీకరిస్తున్నాయి. ఆయనపై ప్రభుత్వ వర్గాల్లో ఏ మాత్రం కనికరం ఉన్నా, శనివారం ఆయనను ఆస్పత్రిలో ఉంచేవారని, ఆయన చెప్పే కారణాలను అంగీకరించేవారని అంటున్నారు. గతంలో ప్రభుత్వ పెద్దలపై పోసాని చేసిన వ్యాఖ్యల కారణంగా ఆయనను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టొద్దనే ఒత్తిడి ప్రభుత్వంపై వస్తోందని చెబుతున్నారు. అటు సినీ రంగం నుంచి కూడా పోసానికి మద్దతుగా ఎవరూ మాట్లాడకపోవడంతో ఆయనకు మరిన్ని కష్టాలు ఎక్కువయ్యాయని అంటున్నారు.

వైసీపీ నుంచి ఆయనకు అన్నిరకాల న్యాయ సహాయం అందుతున్నా, ప్రభుత్వం, పోలీసుల బలమైన వాదనలతో అవన్నీ వీగిపోతున్నట్లు ప్రస్తుత పరిస్థితుల బట్టి అర్థమవుతోందని అంటున్నారు. అందుకే ఆయన తనకు తెలిసినా సినిమా ట్రిక్స్ ను వాడుకోవాలని డిసైడ్ అయ్యారా? అనే చర్చ జరుగుతోంది. దీనివల్ల ఆయనకు మంచి జరగకపోగా, మరిన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని న్యాయవర్గాలు చెబుతున్నాయి. అనారోగ్యం లేకపోయినా కుంటి సాకులతో ఆస్పత్రికి వెళితే.. భవిష్యత్తులో బెయిల్ విచారణ సందర్భంగా పోలీసులు ఆ విషయాన్ని ప్రస్తావించి బెయిల్ ప్రయత్నాలకు గండి కొట్టే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.

ప్రస్తుతం రాజంపేట జైలులో ఉన్న పోసాని తొలి నుంచి గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆయనకు సంబంధిత మందులు ఇస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. అయితే శనివారం తనకు కడపునొప్పిగా ఉందని, అనంతరం గుండెనొప్పి అంటూ చెప్పిన పోసాని మాటలను డాక్టర్లు ధ్రువీకరించలేదు. ఆయనకు అంతా బాగుందని సర్టిఫికెట్ ఇవ్వడంతో పోసాని మళ్లీ జైలుకు వెళ్లాల్సివచ్చింది. తన సినిమా ట్రిక్కు పనిచేయకపోవడంతో ఇప్పుడు పోసాని ఏం చేస్తారనేది ఆసక్తి రేపుతోంది.

## ఇంట్లో బీరువా పైన బుసలు కొట్టిన నాగుపాము.. పరుగులు పెట్టిన కుటుంబ సభ్యులు




**హైదరాబాద్ పెన్ పవర్:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం తెలగ రామవరం గ్రామంలోని ఓ ఇంట్లో ఆరడుగుల త్రాచుపాము హల్ చల్ చేసింది. నారసాని నర్సయ్య ఇంట్లోని బీరువా చాటున సుమారు 6 అడుగుల తాచుపాము చేరి బుసలు కొట్టింది. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో స్నేక్ రెస్క్యూ టీంకు సంఘటన స్థలానికి చేరుకొని స్నేక్ క్యాచర్స్ పి.బలరాం, మహేశ్ లు సుమారు 6 అడుగుల నాగుపామును చాకచక్యంగా బంధించి అటవీ ప్రాంతంలో వదిలేశారు. తమ ఇంటి ఆవరణలో నిన్ననే పాము కనిపించిందని.. మళ్లీ చూసేసరికి బీరువాపై చేరి బుసలు కొడుతూ కనిపించిందని నర్సయ్య తెలిపారు. పామును బంధించి అడవిలో వదిలివేయడంతో నరసయ్య కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

## రూ.1,83,01,500 కోట్లు.. ఏడాదిలో మనోళ్లు దేనికి ఖర్చు చేశారో తెలుసా?




**హైదరాబాద్ పెన్ పవర్:**ఏడాది వ్యవధిలో వస్తు సేవల కోసం భారతీయులు ఖర్చు చేసిన మొత్తంపై డెలాయిట్ – ఆర్ఏఐలు తాజాగా విడుదల చేసిన అధ్యయన వివరాలు ఆసక్తికరంగానే కాదు.. ఆశ్చర్యానికి గురి చేసేలా ఉన్నాయని చెబుతున్నారు. 2024లో రూ.1,83,01,500 కోట్ల భారీ మొత్తాన్ని దేశ ప్రజలు వస్తు సేవల కోసం వెచ్చించారని.. అంతకు ముందు ఏడాది (2023లో) ఇది రూ.87,15,000 కోట్లు మాత్రమేనని అధ్యయనం వెల్లడించింది. 7.2 శాతం వృద్ధితో అమెరికా.. చైనా.. జర్మనీ కంటే భారత్ వేగంగా ఉన్నట్లు ఈ రిపోర్టు పేర్కొంది. 2026 నాటికి ప్రపంచంలోనే మూడో అతి పెద్ద వినియోగదారుల మార్కెట్ గా అవతరించే దిశగా వెళుతుందని పేర్కొన్నారు. ఇది 2030 నాటికి రూ.20,04,450 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. 2030 నాటికి ఏడాదికి రూ.8.71 లక్షల కంటే ఎక్కువ సంపాదించే భారతీయుల సంఖ్య దాదాపు మూడు రెట్లు దూసుకెళ్లి 16.5 కోట్లకు చేరుతుందని పేర్కొన్నారు. 2024లో ఇది కేవలం 6 కోట్లు మాత్రమే కావటం గమనార్హం. దేశంలో మధ్యతరగతి వర్గాల వృద్ధిని.. విచక్షణా వ్యయంవైపు ప్రాథమిక మార్పును చెబుతున్నట్లుగా అధ్యయనం వెల్లడించింది. జనాభాలో 52 శాతం ఉన్న జనరేషన్ జెడ్.. మిలీనియల్స్ ఈ మార్పునకు కారణంగా చెబుతున్నారు ప్రీమియం బ్రాండ్లు.. స్థిర ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతున్నట్లుగా వెల్లడించారు. 2030 నాటికి భారతదేశ తలసరి ఆదాయం రూ.3,48,600 దాటుతుందని అంచనా వేశారు. వివిధ రంగాల్లో కొత్త అవకాశాల్ని ఇది తెరుస్తుందని పేర్కొన్నారు. తమ వాదనకు బలం చేకూరేలా ఒక ఉదాహరణను ఇందులో పేర్కొన్నారు, గత ఏడాది క్రెడిట్ కార్డుల సంఖ్య 10.2 కోట్లు ఉందని.. 2030 నాటికి ఈ సంఖ్య 29.6 కోట్లకు దూసుకెళు తుందని చెబుతున్నారు. దీంతో.. వినియోగదారులు చేసే ఖర్చులు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.

## యూట్యూబ్ లోని వీడియోలు అన్నీ చూడడానికి ఎంతకాలం పడుతుందో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:**వంటింటి నుంచి అంతరిక్షం వరకు యూట్యూబ్ లో లేని కంటెంట్ లేదు.. వీడియోల రూపంలో ఏ సమాచారం కావాలన్నా యూట్యూబ్ లో వెతకడం మామూలే. అయితే, య్యూట్యూబ్ లో ఉన్న వీడియోలు అన్నింటినీ వరుసగా చూస్తూపోతే ఎంతకాలం పడుతుందో తెలుసా..? ఏకంగా 18 వేల సంవత్సరాలు పడుతుందట. ఆ స్థాయిలో య్యూట్యూబ్ లో కంటెంట్ ఉందని నిపుణులు చెబుతున్నారు. క్షణక్షణానికి అప్ లోడ్ అయ్యే కంటెంట్ ను కూడా చూడాలంటే అయ్యే పని కాదు. ఎందుకంటే ప్రపంచం నలుమూలల నుంచి ప్రతీ నిమిషానికి ఏకంగా 500 గంటల కంటెంట్ య్యూట్యూబ్ లో అప్ లోడ్ అవుతోందట. ఈ లెక్కన ఓ వీడియో చూసేలోపే మరో నెల రోజులకు సరిపడా వీడియోలు య్యూట్యూబ్ లో చేరుతూ ఉంటాయి. ఇప్పటి వరకు యూట్యూబ్‌లో ఉన్న ఛానళ్ల సంఖ్య దాదాపు 12 కోట్లు. రోజురోజుకూ కొత్త ఛానళ్లు పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఇక, సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన షార్ట్స్ గురించి చెప్పనక్కర్లేదు. 15 సెకన్లు మాత్రమే ఉండే ఈ షార్ట్స్ లను య్యూట్యూబ్ తొలుత భారత్ లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. సక్సెస్ కావడంతో ఇతర దేశాల్లోనూ అందుబాటులోకి తీసుకొచ్చింది. అమెరికాలోని కాలిఫోర్నియా కేంద్రంగా పనిచేసే య్యూట్యూబ్ ప్రపంచంలోని 130 దేశాల్లో 80 భాషల్లో విస్తరించింది. ఉత్తర కొరియా, చైనా, తుర్కియే, మొరాకో, సౌత్‌సుడాన్, ఉజ్బెకిస్థాన్, తజికిస్థాన్ తదితర దేశాల్లో య్యూట్యూబ్ పై నిషేధం అమలవుతోంది. య్యూట్యూబ్ లో మొట్టమొదట అప్ లోడ్ చేసిన వీడియో 'మీ ఎట్ ది జూ'.. య్యూట్యూబ్ రూపకర్తలలో ఒకరైన జావేద్ కరీమ్ షేర్ చేసిన ఈ వీడియోను ఇప్పటి వరకూ 35 కోట్ల మంది చూశారు. ఇక య్యూట్యూబ్ లో అత్యధికమంది చూసిన వీడియో 'బేబీ షార్క్ డూడూ... డూడూ'. పిల్లలు పాడుకునే ఓ రైమ్‌కి సంబంధించిన ఈ వీడియోను అక్షరాలా 1500 కోట్ల మంది చూశారట.

## భర్త నుంచి తప్పించుకునేందుకు ప్రియుడితో కలిసి రన్నింగ్ బస్ ఎక్కి పరారైన భార్య..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆన్ లైన్ లో పరిచయమైన యువకుడి కోసం ఓ వివాహిత తన భర్తను, ఇద్దరు పిల్లలను వదిలేసి వెళ్లిపోయింది. ప్రియుడితో బైక్ పై వెళుతుండగా ఫాలో అవుతున్న భర్తను తప్పించుకునేందుకు రన్నింగ్ బస్ ఎక్కి వెళ్లిపోయింది. చేసేదేంలేక ఆ భర్త పోలీసులను ఆశ్రయించాడు. మేడ్చల్ జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుందీ ఘటన. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేట్ బషీరాబాద్ కు చెందిన సుకన్య(35) కు సోషల్ మీడియాలో గోపీ అనే 22 ఏళ్ల యువకుడు పరిచయమయ్యాడు. ఆన్ లైన్ చాటింగ్, ఫోన్ లో మాట్లాడుకోవడంతో ఈ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. సుకన్యకు అప్పటికే వివాహం జరగగా ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. అయినా గోపి లేకుండా ఉండలేనని భావించిన సుకన్య.. ప్రియుడితో పారిపోయేందుకు సిద్ధమైంది. ఫిబ్రవరి 5న ఇంట్లో నుంచి వెళ్లిపోయి గోపితో కలిసి ఉంటోంది. భార్య కనిపించడం లేదంటూ సుకన్య భర్త ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి సీసీ కెమెరాల ఆధారంగా గోపితో వెళ్లిందని నిర్ధారించుకున్నారు. వారికోసం గాలిస్తుండగా మేడ్చల్ లోని ఆక్సిజన్ పార్క్ వద్ద బైక్ పై వెళుతున్న గోపి, సుకన్య కనిపించారు. దీంతో వారిని ఆపి విచారిస్తుండగా.. బైక్ ను అక్కడే వదిలేసి సుకన్య, గోపి రన్నింగ్ బస్ ఎక్కి మళ్లీ పారిపోయారు. మేడ్చల్ లో సంచలనం సృష్టించిన ఈ కేసులో సుకన్య, గోపి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# ఎంతకు తెగించారయ్యా.. కారును ల్యాబ్‌గా మార్చి.. లింగ నిర్ధారణ పరీక్షలు..!




**హైదరాబాద్ పెన్ పవర్:**ఒకవైపు లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దని ప్రభుత్వం చట్టం చేసి ఎన్ని ఆంక్షలు విధించినా కొన్ని ఆస్పత్రులు లోగుట్టుగా పరీక్షలు చేయడం అక్కడక్కడా చూస్తూనే ఉన్నాం. ఆ స్పత్రులకు ఫైన్ వేయడం, మరీ మితిమీరితే సీజ్ చేయడం జరుగుతూనే ఉంది. అయినా కొందరి బుద్ధి మారడం లేదు. ఆస్పత్రిలో అయితే తెలిసిపోతుందనీ.. రూట్ మార్చారు. కారునే ల్యాబ్ గా మార్చుకున్నారు కేటుగాళ్లు. జెండర్ టెస్టులు చేస్తూ రహస్యంగా ఆపరేషన్ చేయిస్తూ అడ్డదారిలో సంపాదనకు మరిగారు. తాజాగా ఖమ్మం జిల్లాలో ఇలాంటి చట్టవిరుద్ధమైన పని చేస్తున్న ముఠాను అరెస్టు చేశారు పోలీసులు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా అల్లిపురానికి చెందిన కాత్యాయని గతంలో ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ గా పని చేసేది. బల్లేపల్లికి చెందిన ఆర్.ఎం.పి చారి, కుదుమూరుకు చెందిన ఆర్ఎంపి రాచబండి మనోజ్ తో పరిచయం ఏర్పడింది. అక్రమ సంపాదన కోసం ఒక ముఠాగా ఏర్పడి కారు కొనుగోలు చేశారు. అందులో అల్ట్రా సౌండ్ స్కాన్, ఇతర సామాగ్రిని అమర్చారు. ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాలలోని గ్రామాలకు వెళుతూ గర్భంతో ఉన్న మహిళలకు మాయ మాటలు చెప్పి కారులోనే లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడ, మగ అని చేప్పేవారు. ఈ పరీక్షకు రూ.5 నుంచి 10వేల రూపాయల వరకు వసూలు చేసేవారు. గర్భం ఇష్టంలేని మహిళల్ని అబార్షన్ కొరకు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి రహస్యంగా పంపి అబార్షన్ చేయించేవారు. దీనికోసం వేల రూపాయలు వసూలు

చేస్తూ దందా జోరుగా కొనసాగిస్తున్నారు. ఈ అక్రమ దందా ముఠా గురించి సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. ముఠాలోని ఇద్దరిని అరెస్టు చేయగా, ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట రీత్యా నేరం. పుట్టబోయేది ఆడ అయినా మగ అయినా ఈ రోజుల్లో పెద్ద తేడా ఏమీ ఉండదు. కొన్ని సార్లు వయసు మళ్లిన తల్లిదండ్రులను ఆడపిల్లలే చివరికి పోషిస్తున్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా సమానం అనే భావన కలిగి ఉండాలని పోలీసులు, అధికారులు సూచిస్తున్నారు.

# ఎలాన్ మస్క్ టెస్లాకు నిరసన సెగ.. కారణం క్లియర్!




**హైదరాబాద్ పెన్ పవర్:**గత ఏడాది జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపు అనంతరం డొనాల్డ్ ట్రంప్ ఓ ఆసక్తికర నిర్ణయాన్ని తీసుకున్నారు. ఇందులో భాగంగా... డిపార్ట్ మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డొజ్) ను ఏర్పాటు చేశారు. ప్రధానంగా.. వృథా ఖర్చులను తగ్గించడంతో పాటు ప్రభుత్వ వ్యవస్థల్లో మార్పులు తీసుకురావడమే దీని లక్ష్యంగా ఫిక్స్ చేశారు! దీని బాధ్యతలను ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు అప్పగించారు. నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాన్ మస్క్ అతిపెద్ద సమస్యగా మారారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే 2 వేల మంది యూఎస్ ఎయిడ్ ఉద్యోగులపై వేటు వేశారు. మిగిలిన ఉద్యోగులకు బలవంతపు సెలవులు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ సమయంలో ఈ ఎఫెక్ట్ టెస్లాకు తగిలింది!

అవును... ఉద్యోగులంతా గతవారం ప్రభుత్వం కోసం ఏమి పని చేశారో వివరించాలని.. అలా చేయలేని పక్షంలో వారు తమ తమ పదవులకు రాజీనామా ఇవ్వాలని ఇటీవల ఎలాన్ మస్క్ అల్టిమేటం జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఉద్యోగులకు మస్క్ కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారని అంటున్నారు. దీంతో.. టెస్లా ముందు నిరసనలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా... అమెరికా అంతటా టెస్లా డీలర్ షిప్ ల ముందు నిరసనలు చెలరేగాయి. ఆ సంస్థ సీఈవో ఎలాన్ మస్క్ ను లక్ష్యంగా చేసుకుని, డోజ్ ను వ్యతిరేకిస్తూ నిరసనలు చేస్తున్నారు. ట్రంప్ తో కలిసి మస్క్ 'డొజ్' పేరు చెప్పి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెబుతూ.. ఉద్యమానికి తెరలేపారు. మస్క్ రాజకీయ ప్రమేయానికి వ్యతిరేకంగా ఈ నిరసనలు మొదలయ్యాయి. మస్క్ నిర్ణయాలు కాంగ్రెస్ అధికారాన్ని బలహీనపరుస్తుందని.. అతని వ్యక్తిగత వ్యాపారాలకు మాత్రం ప్రయోజనాలు చేకూరుస్తుందని చెబుతున్నారు. ఈ సందర్భంగా... బోస్టన్, న్యూయార్క్, కాలిఫోర్నియాలోని వివిధ నగరాల్లో నిరసనలు చెలరేగాయి! ఈ సందర్భంగా... టెస్లా ఉత్పత్తులను బహిష్కరించాలని నిరసనకారులు పిలుపునిచ్చారు. ఈ ఎలక్ట్రి క్ కార్ల దిగ్గజ వాహనాలను కొనుగోలు చేయకుండా ఉండాలని వారు కోరుతున్నారు. దీంతో... ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. డోజ్ పనులు మస్క్ కు రాజకీయంగానే కాకుండా వ్యాపార పరంగానూ సమస్యగా మారుతున్నట్లున్నాయని అంటున్నారు! కాగా... వివాదాలు ఉన్నప్పటికీ, వ్యతిరేకత పెరుగుతున్నట్లు చెబుతున్నప్పటికీ ఎలాన్ మస్క్ నికర విలువ మాత్రం పెరుగుతూనే ఉంది. ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచీ టెస్లా స్టాక్ తగ్గినట్లు చెబుతున్నప్పటికీ.. బ్లూమ్ బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం ప్రపంచ కుబేరుల జాబితాలో %వి%351 బిలియన్ డాలర్స్ తో టాప్ ప్లేస్ లో కొనసాగుతున్నారు.